


అసలీకాలప్పొలిటీషియన్‌లకి ఐకమత్యపు విలువ తెలీలేదండీ వదినా. ఒక్క ఘడీసేపు ఒక్క మాటమీద నిలబడ్రు. చెరువునీటిమీద చిళ్ళపెంకులా అలా అలా మాటలమీద జరుక్కుంటూ పోతారు. అందికే గవర్నమెంట్లిల్లా అఘోరిస్తున్నాయి. సృష్టిలో ప్రతి ఒక్కటిన్నీ ఉద్ఘోషించేది ఏమిటి? అయికమత్యం కావాలోయ్ చవలాయా అని. రూపాయికాసు చూడండి. అందులో పదహారణాలూ కలిసివుంటేనే వాటి సత్తా. అలా

గుంభనగా కూడబలుక్కు నిలబడతాయి. ఏదీ ఆ రూపాయి నోమారు మార్చి చూడండి. ఆర్జించినవాడు హరీమనగానే వాడిసంతంతా తలకాస్త్రా పంచుకు తలోదారినా పోయినట్టు చక్కాపోతాయి. అణాకాసులు సెనగపప్పుల్లా చెల్లుబడయిపోతాయి. అలాగే మాటవరసకి చెబుతున్నాన్మండి.యగ్జాంపులుగా యవర్నో ఎందుకు గిరీశం అండ్ బుచ్చమ్మలనే తీసుకుచూడండి. వారిద్దరిమాట యాకమ్మై వారు కలిసి నిలబడితే లోకం, సంఘం, ఛాందసప్పెద్దలూ వారిని తేరిచూడగలరా? యంతమాత్రం చూడలేరు. సంఘీభావం లేకపోతే యామవుతుంది! ఓ మంచిరోచ్చూసి అబ్బీ గిరీశం నువ్వీహ నడు అని నన్ను పొమ్మంటారు. బుచ్చమ్మ దన్ను లేని గిరీశం నిర్బలుడై, నిస్తేజుడై, రోగియై, విరాగియై, చిక్కి సగమై తరువాత చచ్చి పోతాడు. అయ్యో సద్బ్రాహ్మడి న్నం పీశానేః అని దుంఖించడం తప్ప రెండో పనుండదు మీకు.....

రా వెంకటేశం రా. వేళకొచ్చావు. యూనిటీమీద లెక్చరిస్తున్నాను. విని బాగుపడు. రేప్పిక్చరు తీసినపుడిదంతా అందులో గుప్పించెయ్యాలి. అసల్నన్నడిగితే ఈ అయికమత్యమ్మీద సినిమావాళ్ళకున్న గురిలో నూరో వంతు మనందరికీ వుంటే దేశం ఎప్పుడో బాగుపడేదోయి. వాళ్ళనుచ్చూసి బుద్ధితెచ్చుకోవాలి మనవంతా. వాళ్ళు చూడు. అందరూ ఎల్లప్పుడూ ఒకటే కథని సినిమా తీస్తారు. యాడాది కెన్ని పిక్చర్లు చూస్తావు. ఎక్కడేనా ఒహ దానికీ ఒహదానికీ ఒక్క అడుగులోనైనా తేడా వుందా చెప్పు. ఎందుకుంటుంది. ఉండదు. వాళ్ళు బాగుపడే లక్షణం ఉన్నవాళ్ళు. వాళ్ళకి అయికమత్యం విలువ తెలుసు. యునైటెడ్ వుయ్‌స్టాండ్--అనగా మేమంతా ఈ విషయాల్లో కలిసికట్టుగా ఉంటాం. ఒకటే కథ తీస్తాం ఒక్కలాగే తీస్తాం. డివైడెడ్ వుయ్ ఫాల్ అనగా అలా చేయక తలా వక కథా తీసుకుని తలా వకదారినా సినిమాలు తీసినట్లయితే --వుయ్ ఫాల్--అనగా మేవంతా కూలిపోతాము అని వాళ్ళనమ్మిక. దట్ మైడియర్ వెంకటేశం ఈజ్ 'ఇన్‌షార్ట్' ది సీక్రెట్ ఆఫ్ దెయిర్ సక్సెస్,

వక్క కథలోనే కాదు,అన్నిటా వాళ్ళకి యీ ఐకమత్యం మీద గురి వుంది. వాళ్ళకి దొరికినవి ఒకటోరకం పాత్రలు. అందరికీ ఆ వక్కటే రకం పాత్రలుంటాయి. అన్ని పిక్చర్లలోను అవి వక్కటే రకం విగ్గులు(వకటోరకమే) పెట్టుకుంటాయి. ఒకటేరకం విగ్గులు

(వకటోరకమే) పెట్టుకుంటాయి. ఒకటేరకం దుస్తులు ధరిస్తాయి. వకటే రకం డైలాగుల్లో, పాటల్లో ఏడుస్తాయి, ఏడిపిస్తాయి, నవ్వుతాయి, నవ్విస్తాయి. నవ్వులపాలవుతాయి. వక్కటే రకంగా పుడతాయి. పెరుగుతాయి. గిడుతాయి. అన్ని పెళ్ళాలనూ వకటే కిటికీ చిల్లుల్లోంచి. వకటే రకం షాటులో చూసి వకటేరకంగా అపోహపడతాయి. వకటే రకం అవుడ్డోరులో (మహాబలిపురం, పూనమల్లి హైరోడ్డు) తిరుగుతాయి. తరువాత వకటే రకం కారుకింద పడి, వకటే రకం దెబ్బ (పలాస్త్రీ మార్కు) తగిలించుకుంటాయి. చివర్ని అన్ని పాత్రలూ కలిసి వకటే రకంగా గ్రూపు ఫోటో తీయించుకుంటాయి--మూడో రీల్లో ఫోర్షన్ పోగొట్టుకున్న పెరుమాళ్ళు (బహువచనంస్మీ) వినా.

మ్యూజిక్ మాత్రం? వాళ్ళి మధ్య యూనియన్ గూడా పెట్టారుట. ఐకమత్యంలో మెలగీ, తమలో దామే గాదు డిస్ట్రిబ్యూటర్ ప్రొడ్యూసర్లతో గూడా--అందరూ ఒకటే రకం పాటల్ని ఒకటోరకంగా కాపీ కొట్టడంలో ఘనవిజయం సాధిస్తున్నారు. పొడుగు చూడు, ఒకడుగు తభావతు రానీరు గద.

వేయేల వెంకటేశం ఒక్క హెడ్డింగు మినహా మన సినిమాలలో మిగతావన్నీ వహటే విధంగా ఉంటాయి. అందికే 'వాటీజినె నేమ'న్నాడు షేక్స్పియరు. పేరులో ఏవుంది "ఏ రోజీజె రో జీజె రోజ్" అందో సీమ దొరసాని ఇంకేవనాలో తెలీక. అలాగే మన సినిమాలూనూ.

ఫలం చెడ్డా విధం దక్కాలన్న పట్టుదల దక్కించుకునే ఐకమత్యవున్నూ మనవారి సొత్తు. అందికే బలవత్తరమైన ప్రజాభిప్రాయం గానీ, తీవ్రమైన విమర్శలు రానీ వాళ్ళు చెక్కు చెదరకుండా నిలబడి ఉన్నారు. విమర్శలు చేసేవాళ్ళు వెధవాయిలనుకో. గిట్టనివాళ్ళు, ఓర్వలేనివాళ్ళు, ప్రజలు పాపం ఉట్టి గొర్రెల మందలు గదా! వాళ్ళేమీ అనరు. అనుకోరు. "ఇహ నీ సినిమా ఇప్పట్లో బాగుపడదు. దీన్నేం జేసీ లాభం లేదు." అన్న నిస్పృహ కొద్దీ వదిలేశారని, గిట్టనివాళ్ళంటారే గాని అది వుట్టి భ్రమ అని-మ్మా అనగా సినిమావాళ్ళ నమ్మిక.

అందువల్లనే మేమిటుపై నుంచి ఈ గిట్టనివాళ్ళ నెత్తినో మొట్టికాయ వేసి, ఆ విమర్శలేవో మేవే అఘోరిస్తామని చెప్పదలుచుకున్నాం నుబ్బరంగా. మా పిక్చర్లని మేవే

మెచ్చుకుంటూ పత్రికా విమర్శలు రాసి పారేసి అచ్చు కొట్టించేస్తాం. సీవఁదొర్లలాగే చేస్తారుష నీకు దెల్సో లేదో. కుంపిణీవాడే తన తాజాపిచ్చరు మీద విమర్శ రాసేయించి, అందులో నిజాయితీకి రెండు చవాకులు గీకి--అబద్ధం. ఆపాటి లోపాలు కూడా వుండవు గాని జనవేడ్చి పోతారని లోపాలున్నట్టభినయించడవన్నమాట--అచ్చు కొట్టి పంచి పెట్టిస్తాడు.

అవి ప్రజగాడు చదవడంటావా? లవుడు స్పీకర్లమీద చెవులు హోరెత్తిపోయేలా చదివేస్తాం. వూరూరు అహోరాత్రాలూ టముకేయించేస్తాం.....అప్పటికి జనం నమ్మక హాలువేపు రాపోతే, మేవే టిక్కెట్లు కొనేసుకెళ్ళి మరోమారు చూస్చక్కావస్తాం. బాగుందండోయ్ అని పొరుగువాడికి చెప్పి పోరుపెడతాం. మే వెరిగిన మినిష్టర్ల చేత ఒపినియన్స్ ఇప్పించి ఆశపెడతాం. అసలిందాకా రాదులే. మనవాళ్లట్టి గొర్రెల మందలు. వాళ్ళకీ తభావతులన్నీ తెలిస్చస్తాయా యేవిటి.

సో మైడియర్ వెంకటేశం! నేను ప్రొడక్షన్‌కే గాక రిలీజ్‌కీ పబ్లిసిటీకీ, అనుకూల విమర్శకీ, జనానికీ కూడా ఏర్పాట్లు చేసేశాను. నీదీ మీ సిన్నర్దీ మాత్రమే ఆలీసెం. రిమెంబర్. యునైటెడ్ వుయ్ ఫాల్. మనమంతా కలిసికట్టుగా ఇందులో పడదాం; డివైడెడ్ వుయ్ శ్టాండ్--పడి లేచాక విడివిడిగా నిలబడదాం--నా అంత గొప్పవాణ్ణి నేనేస్మీ అని.

